సాక్షి
నిజామాబాద్

శుక్రవారం । 14 । జూన్ । 2024



ఆపన్న హస్తం కోసం..
మల్టీపుల్ ఆర్గాన్స్ ఇన్ఫెక్షన్‌తో బాధ పడుతున్న తల్లిని కాపాడుకునేందుకు కొడుకు తల్లడిల్లుతున్నాడు.
- 8లో ▸



కాలంచెల్లిన మందులు..
పొతంగల్ పీహెచ్‌సీలో హెగ్డోలికి చెందిన మహిళకు కాలం చెల్లిన మందులు ఇచ్చిన ఘటన వెలుగుచూసింది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.1 /25.7

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. ఈదురు గాలులు వీస్తాయి. అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

బాల రచయిత్రి వైష్ణవికి పురస్కారం



దేగల వైష్ణవి

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తడపాకల్ గ్రామానికి చెందిన బాల రచయిత్రి దేగల వైష్ణవి శ్రీవాణి సాహిత్య పరిషత్ పెందోట బాల సాహిత్య పురస్కారానికి ఎంపికైంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 80 మంది రచయితలు వారి రచనలను పంపగా, తొమ్మిది పురస్కారాలకు ఎంపికకాగా, వైష్ణవి రచించిన 'చిన్నారి కథలు' బాలసాహిత్య పురస్కారం లభించింది. 30 కథలతో వైష్ణవి రచించిన 'చిన్నారి కథలు' పుస్తకం గతేడాది నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆవిష్కరించారు. త్వరలో సిద్దిపేటలో నిర్వహించనున్న కార్యక్రమంలో వైష్ణవి పురస్కారాన్ని అందుకోనుందని తెలుగు పండిత్ ప్రవీణ్‌శర్మ తెలిపారు. బాల రచయిత్రి వైష్ణవికి ఉపాధ్యాయులతోపాటు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

'ఓపెన్' ఫలితాలు విడుదల

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా ఆరో స్థానంలో, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఎనిమిదో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. 1,592 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 1,310 మంది, 1,699 మంది ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాయగా 1,100 మంది ఉత్తీర్ణులైనట్లు వివరించారు. రీ కౌంటింగ్‌కు ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు అవకాశం ఉందని, రీ కౌంటింగ్‌లోని ప్రతి జవాబు పత్రానికి ఓపెన్ ఇంటర్‌వాళ్లు రూ.400, పదో తరగతి వారు రూ.350 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే, ఓపెన్ ఇంటర్ రీ వెరిఫికేషన్ కోసం రూ.1,200, పదో తరగతి వారు రూ.1,200 ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

1.86 క్వింటాళ్ల గంజాయి సీజ్

- కామారెడ్డి జిల్లాకు చెందిన ముగ్గురి అరెస్ట్



కొత్తగూడెంటౌన్: కారులో అక్రమంగా తరలిస్తున్న రూ. 75 లక్షల విలువైన 1.86 క్వింటాళ్ల గంజాయిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. స్థానిక ఎస్సై విజయ, సిబ్బందితో కలిసి గురువారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ అండర్ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కారులో వస్తున్న ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించడమే కాక పోలీసులను గమనించి పారిపోయేందుకు యత్నించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా కామారెడ్డి జిల్లాకు చెందిన పెనుగొండ నర్సింలు, కుంచం లక్ష్మణ్, భూక్యా లక్ష్మణ్‌గా గుర్తించారు. వీరు ఒడిశాలోని మల్కన్‌గిరిలో 1.86 క్వింటాళ్ల గంజాయి కొనుగోలు చేసి కారులో భద్రాచలం మీదుగా మహారాష్ట్రలోని షోలాపూర్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. గంజాయి, కారును స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

సివిల్స్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి క్రైం: సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు, ఇంటర్వ్యూ (2025) కోసం సన్నద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇవ్వనున్నామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులను అబ్జెక్టివ్ టైప్, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించకూడదని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 30 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 62817 66534 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఈదురు గాలుల బీభత్సం

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. వెల్లుట్లలో సాయిలు, విఠలేశ్వరాలయం, సాయిబాబాకు చెందిన రేకుల షెడ్లు ఎగిరిపోయాయి. వెంకటాపూర్‌లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు..!

- ప్రజాపాలన సైట్‌లో టెక్నికల్ సమస్యలు..
- మండల కార్యాలయాల చుట్టూ ప్రజల చక్కర్లు
- గ్యాస్ సబ్సిడీ, కరెంట్ జీరో బిల్లులు రాక ఇబ్బందులు
- ప్రభుత్వం స్పందించాలని దరఖాస్తు దారుల వేడుకోలు



నగరంలో ప్రజాపాలన దరఖాస్తులను అందజేస్తున్న ప్రజలు (ఫైల్)

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభయహస్తం ద్వారా లబ్ధి పొందాలనుకునే వారికి ఎదురు చూపులు తప్పడం లేదు. గ్యాస్ సబ్సిడీ, జీరో విద్యుత్ బిల్లుల కోసం దరఖాస్తులు అందజేసినప్పటికీ చాలా మందికి సాంకేతిక సమస్యలు, దరఖాస్తుల్లో తప్పిదాల కారణంగా పథకాలు వర్తించడం లేదు. దీంతో మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ ప్రజలు చక్కర్లు కొట్టారు. ఎలక్షన్ కోడ్ ముగియడంతో ప్రజాపాలన సైట్ తిరిగి ప్రారంభం కాగా, జిల్లాలోని చాలా మండలాల్లో సాంకేతిక కారణాల వల్ల సైట్ తెరుచుకోవడం లేదు. తెరుచుకున్నా.. ఎడిట్ ఆప్షన్, ఇతర టెక్నికల్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తులు ఇలా..

గతేడాది డిసెంబర్ 28 నుంచి ఈ ఏడాది జనవరి 6వ తేదీ వరకు 530 గ్రామపంచాయతీలతోపాటు నిజామాబాద్ కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీల్లోని 164 వార్డుల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా 4,05,409 నివాసగృహాలు ఉండగా, 15,71,022 జనాభా ఉంది. ఒక్కో ప్రజాపాలన దరఖాస్తులో ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. అందులో నుంచి ఒక్కో పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను క్రోడీకరించి ఏయే పథకానికి ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారో విభజించారు.

పథకం	దరఖాస్తుల సంఖ్య
వంట గ్యాస్	4,07,245
ఉచిత విద్యుత్	3,89,582
మహాలక్ష్మి (రూ.2500)	3,55,347
వ్యవసాయ కూలీలు	1,80,511
ఇతర పింఛన్లు	1,48,027
రైతు భరోసా	1,42,654
దివ్యాంగ పింఛన్	9,194
ఉద్యమకారులకు ఇంటి స్థలం	2,240
కౌలు రైతులు	7,194
అమరవీరులకు ఇంటిస్థలం	793

పథకాలు వర్తింపజేయాలి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీరో విద్యుత్ బిల్లు, గ్యాస్ సబ్సిడీ పథకాలు నాకు వర్తించడం లేదు. దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. అమలు కాకపోవడంతో అధికారులను సంప్రదించాను. ఎన్నికల కోడ్ కారణంగా సైట్ ఓపెన్ కాలేదని చెప్పారు. కోడ్ ముగిసినందున రెండు పథకాలను వర్తింపజేయాలి.
– రాజ్‌నారాయణ, సింగంపల్లి

లోపాలు సరిచేస్తున్నాం

ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజాపాలన సైట్ ఓపెన్ అయ్యింది. కొన్ని మండలాల్లో రెండు రోజులుగా టెక్నికల్ సమస్యలు ఎదురవుతున్నాయి. లోపాలను సరి చేస్తున్నాం. ఒకటి, రెండు రోజుల్లో అన్ని మండలాల్లో ప్రజాపాలన సైట్ పని చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.
– కార్తీక్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్

తెలుగు పుస్తకాలు వెనక్కి

- 'ముందుమాట'లో తొలి సీఎం కేసీఆర్, నాటి మంత్రుల ప్రస్తావన
- లక్షా 80వేల పుస్తకాలను తిరిగి పంపిస్తున్న విద్యాశాఖ

నిజామాబాద్‌అర్బన్: తెలుగు పాఠ్యపుస్తకాల్లోని 'ముందుమాట'లో తొలి సీఎం కేసీఆర్, నాటి మంత్రులు, అధికారుల ప్రస్తావన ఉండడంపై ఫిర్యాదులు అందడంతో వాటిని వెనక్కి పంపించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం సరఫరా చేసిన తెలుగు పుస్తకాలను జిల్లా అధికారులు గురువారం నుంచి వెనక్కి తెప్పించుకుంటున్నారు. జిల్లాలో 6 లక్షల 17 వేల 879 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, నేటి వరకు 5లక్షల 80 వేల 342 పుస్తకాలు పంపిణీ చేశారు. ఇందులో లక్షా 80వేల తెలుగు పాఠ్యపుస్తకాలున్నాయి. వాటన్నింటినీ వెనక్కి తీసుకొని మళ్లీ ముద్రించి సరఫరా చేయనున్నట్లు తెలిసింది. జిల్లాలో 693 ప్రాథమిక, 116 ప్రాథమికోన్నత, 260 ఉన్నత, ప్రభుత్వ ఆధీన పాఠశాలలు 112, కేజీబీవీలు 25, మోడల్ స్కూళ్లు 10 ఉన్నాయి. 468 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా అన్ని రకాల పాఠశాలల్లో కలిపి 2,87,820 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు మొదటి లాంగ్వేజ్‌గా తెలుగు సబ్జెక్టును తీసుకుంటారు. వీరందరికీ తెలుగు పాఠ్య పుస్తకాలు తప్పనిసరి.

తెలుగు బోధనకు ఆటంకమే

పాఠ్యపుస్తకాలను వెనక్కి పంపిస్తే తెలుగు బోధనకు ఆటంకం ఏర్పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. పాఠశాలలు ప్రారంభమైన తరువాత పుస్తకాలను వెనక్కి తీసుకుంటే అన్ని తరగతుల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారని అంటున్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆదేశాలు వచ్చాయి

తెలుగు మీడియానికి సంబంధించిన తెలుగు పాఠ్యపుస్తకాలను వెనక్కి పంపించాలని ఆదేశాలు వచ్చాయి. వాటన్నింటిని తిరిగి పంపుతున్నాం. మళ్లీ కొత్త పాఠ్యపుస్తకాలు వస్తాయి. అప్పటి వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తెలుగు బోధన చేపడుతాం. కొత్త పుస్తకాలు రాగానే పంపిణీ చేస్తాం. – దుర్గాప్రసాద్, డీఈవో

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి



విభాగాధిపతులతో మాట్లాడుతున్న తెయూ రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): 2024–25 విద్యాసంవత్సరంలో సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం యాదగిరి సూచించారు. వేసవి సెలవుల అనంతరం యూనివర్సిటీ పరిధిలోని కళాశాలలు గురువారం పునఃప్రారంభం కాగా, వర్సిటీలోని తన చాంబర్‌లో అన్ని విభాగాల అధిపతులతో రిజిస్ట్రార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయడంతోపాటు ఇంటర్నల్ మార్క్స్, ప్రాక్టికల్స్, థియరీ ఎగ్జామ్స్‌ను అల్మనాక్‌ను అనుసరించి నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో కంట్రోలర్ ఎం అరుణ, వివిధ విభాగాల అధిపతులు సీహెచ్ ఆంజనేయులు, మూసాఖురేషీ, డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ అడికే నాగరాజు, డాక్టర్ భ్రమరాంబిక, డాక్టర్ శాంతాబాయి, డాక్టర్ లక్ష్మణచక్రవర్తి, డాక్టర్ శిరీష, డాక్టర్ జమీల్ అహ్మద్, డాక్టర్ ఏ పున్నయ్య, డాక్టర్ రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతికి మళ్లీ దరఖాస్తులు

- నేటి నుంచి స్వీకరణ
- మరో 30వేల దరఖాస్తులు అందే అవకాశం

నిజామాబాద్‌నాగారం: ఎలక్షన్ కోడ్ ముగిసిన నేపథ్యంలో గృహజ్యోతి దరఖాస్తుల స్వీకరణను శుక్రవారం నుంచి పునఃప్రారంభించనున్నారు. ఇప్పటికే 2లక్షల 42వేల మంది వినియోగదారులకు జీరో బిల్లు అందుతుండగా, మరో 8వేల మందిని అర్హులుగా గుర్తించారు. దరఖాస్తుల స్వీకరణ మళ్లీ ప్రారంభం కానున్న నేపథ్యంలో మరో 30వేల దరఖాస్తులు అందే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. మండల, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నారు.

జిల్లాలో 8 లక్షల వరకు విద్యుత్ కనెక్షన్లు ఉండగా ఇందులో ఇళ్ల కనెక్షన్లు 4.80లక్షలు ఉన్నాయి. రేషన్‌కార్డు ఉండి 200లోపు విద్యుత్ వినియోగించే వారికి గృహజ్యోతి పథకం అమలు కానుంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2లక్షల 80వేల ఇళ్లకు గృహజ్యోతి పథకం అమలవుతుందని విద్యుత్‌శాఖ ఎస్ఈ రవీందర్ తెలిపారు.

ఊపిరి పీల్చుకున్న తెలుగు రాష్ట్రాలు..

- కువైట్ అగ్ని ప్రమాదంలో 49 మంది మృత్యువాత
- తెలంగాణ, ఏపీ కార్మికులు లేకపోవడంతో ఊరట

మోర్తాడ్(బాల్కొండ): ప్రపంచంలో అత్యధికంగా చమురు ఉత్పత్తి చేసే కువైట్ దేశంలోని మంగాఫ్ ప్రాంతంలో బుధవారం చోటు చేసుకున్న ఘోర అగ్ని ప్రమాదంలో భారతీయ వలస కార్మికులే అత్యధిక మంది మృత్యువాత పడ్డారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు ఎవరూ ఈ ప్రాంతంలో లేకపోవడంతో తెలంగాణ, ఏపీ నుంచి వెళ్లిన కార్మికుల కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు. కువైట్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించిందని వార్తలు వెలువడడంతో తమ కుటుంబీకుల క్షేమ సమాచారం తెలుసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ప్రమాదంలో 49 మంది మరణించినట్లు కువైట్ ప్రభుత్వం నిర్ధారించింది. ఇందులో 47 మంది భారతీయ వలస కార్మికులే కావడం తీవ్ర విచారకరం. ఉత్తర్ ప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన 47 మంది వలస కార్మికులతో పాటు ఫిలిప్పిన్స్‌కు చెందిన మరో ఇద్దరు కార్మికులు ఉన్నారు. కువైట్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు దాదాపు 3 లక్షల మంది ఉన్నా.. మంగాఫ్ ప్రాంతంలోని లేబర్ క్యాంపులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన వారు లేరు. ఎన్‌బీటీసీ అనే కంపెనీ భవన నిర్మాణ రంగం పనులు నిర్వహిస్తోంది. ఈ కంపెనీలో పని చేయడానికి వలస కార్మికులు కొంత కాలంగా మంగాఫ్ ప్రాంతంలోని అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. కార్మికుల కోసం మెస్‌లో వంట చేస్తుండగా సిలిండర్ పేలడంతో ప్రమాదం సంభవించింది.

సేఫ్టీ చర్యలు లేకపోవడమే కారణమా?

అపార్ట్‌మెంట్‌లో వలస కార్మికులకు ఎన్‌బీటీసీ కంపెనీ క్యాంపును ఏర్పాటు చేసింది. ఈ భవనం నిర్మించిన వ్యక్తి సరైన రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో భారీ అగ్ని ప్రమాదం జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ప్రమాదంలో తెలంగాణ, ఏపీలకు చెందిన వారు ఎవరు లేకపోవడంతో ఊరటనిచ్చినట్లు అయ్యిందని అక్కడ ఉద్యోగాలు చేస్తున్న మార్క ప్రమోద్‌కుమార్, గన్నారపు విస్‌డమ్‌లు 'సాక్షి'కి వెల్లడించారు. హన్మకొండ, జగిత్యాల్ జిల్లాలకు చెందిన వీరు కొన్నేళ్లుగా కువైట్‌లోనే ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డారు. ప్రమాదంలో చిక్కుకున్న వారికి సహాయక చర్యలు అందుతున్నాయని మృతదేహాలను మార్చురీలలో భద్రపరిచారని వెల్లడించారు.

మూడేళ్ల ముచ్చటే..!

- అధ్వానంగా మారిన రైతు వేదిక భవనాలు
- నాసిరకం పనులతో పగుళ్లు, కుంగుతున్న ఫ్లోరింగ్
- నాణ్యతను పట్టించుకోని కాంట్రాక్టర్లు
- తమకేమీ పట్టనట్లుగా ఇంజినీరింగ్ శాఖ అధికారుల వ్యవహారం



నూత్‌పల్లి రైతు వేదిక వద్ద ధ్వంసమైన ర్యాంప్

డొంకేశ్వర్(ఆర్మూర్): రైతు వేదికలు 'మూడేళ్ల ముచ్చటే' అయ్యాయి. కాంట్రాక్టర్లు నాణ్యతను పట్టించుకోకపోవడంతో ఫ్లోరింగ్ కుంగి, పగుళ్లు ఏర్పడి, రంగులు వెలిసి కళావిహీనంగా మారాయి. గత ప్రభుత్వం ఆగమేఘాలమీద జిల్లా వ్యాప్తంగా నిర్మించిన భవనాలు పదేళ్లు కూడా నిలిచే పరిస్థితి కనిపించడం లేదు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు ఈ నిర్మాణాలను చూసీచూడనట్లుగా వదిలేశారు. దీంతో రైతు వేదికల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పంటల సాగులో రైతులకు దిశానిర్దేశం చేసేందుకు, వారికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2019–20లో రైతు వేదికలను నిర్మించిన సంగతి తెలిసిందే. ఒక్కో భవనానికి రూ.20లక్షలు వెచ్చించి జిల్లా వ్యాప్తంగా 106 రైతు వేదికలను నిర్మించారు. ఓ వైపు కాంట్రాక్టర్ల కక్కుర్తి, మరో వైపు రాజకీయ ఒత్తిడికి తలొగ్గి అధికారులు నాణ్యతను పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు అంటున్నారు.

నిర్వహణ సైతం గాలికి..

రైతుల వేదికల నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోగా, వ్యవసాయశాఖ అధికారులు సైతం గాలికొదిలేశారు. దీంతో జిల్లాలో సగానికిపైగా ఈ వేదికలు మూసే ఉంటున్నాయి. 2022లో వీటి నిర్వహణకు జిల్లాకు రూ.47.77లక్షలు మంజూరు కాగా, అవి నాలుగైదు నెలలకే సరిపోయాయి. దాదాపు రెండేళ్లవుతున్నా మళ్లీ నిర్వహణ నిధులు ఇవ్వలేదు. కరెంట్ బిల్లులు, తాగునీరు, వాచ్ అండ్ వార్డ్, స్టేషనరీ, శిక్షణ సమావేశాలు, ఇతర ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో ఏఈవోలు రైతు వేదికలను తెరిచేందుకు భయపడుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

రైతు వేదికల నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. తద్వారా వాటిని సక్రమంగా నిర్వహించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే పలుచోట్ల గోడలకు పగుళ్లు, ఫ్లోరింగ్ లేచిపోవడం వంటి సమస్యలున్నాయి. ఈ అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
– వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి

మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే

- నీటి సరఫరా వివరాలను సేకరిస్తున్న సిబ్బంది
- ప్రత్యేక యాప్‌లో నమోదు



భీమ్‌గల్ మండలంలో సర్వే నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మోర్తాడ్/డిచ్‌పల్లి: మిషన్ భగీరథ పథకం అమలు తీరు క్షేత్రస్థాయిలో ఎలా ఉందో తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్వేకు ఆదేశించింది. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన మిషన్ భగీరథ ద్వారా లక్ష్యానికి అనుగుణంగా నీరు సరఫరా అవుతోందా? లోపాలు ఏమైనా ఉన్నాయా? తదితర వివరాలను గ్రామ పంచాయతీ కార్యదర్శులు సేకరిస్తున్నారు. ఈనెల 11వ తేదీ నుంచి గ్రామాల్లో సర్వే ప్రారంభం కాగా, క్షేత్రాస్థాయిలో సేకరించిన వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.

2015లో అప్పటి ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేసి ట్యాంకులు, ప్రత్యేకంగా పైపులైన్లు, నిర్ణీత ప్రాంతాల్లో నీటి శుద్ధి కోసం ఫిల్టర్ బెడ్లు నిర్మించింది. కొన్ని గ్రామాల్లో పాత ట్యాంకులకు నీలి రంగు వేసి మిషన్ భగీరథ ట్యాంకులుగా పేరు మార్చింది. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీల పరిధిలో 3.30లక్షల ఇండ్లు ఉండగా, ఉచితంగా నల్లాలు ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాను ప్రారంభించింది. అప్పటి నుంచి ప్రతి వ్యక్తికి రోజుకు 100 లీటర్ల చొప్పున, ఒక ఇంటిలో ఎంత మంది ఉన్నా గరిష్టంగా 500 లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో పంచాయతీ బోరు మోటార్లు, మినీ ట్యాంకుల వినియోగం తగ్గించారు. ప్రస్తుతం చేపట్టిన సర్వే ద్వారా ఒక ఇంటిలో ఎంత మంది వ్యక్తులు ఉంటున్నారు, వారికి సరిపడేంత నీరు సరఫరా అవుతోందా లేక ఏమైనా లోపాలు ఉన్నాయా అనే వివరాలు సేకరిస్తున్నారు. ఇంటి యజమాని ఆధార్ నంబర్, ఫొటో తీసుకోవడంతోపాటు ఇతర వివరాలను నమోదు చేసుకుంటున్నారు. పది రోజులపాటు సర్వే కొనసాగనుండగా, నీటి సరఫరాలో ఎదురవుతున్న లోటుపాట్లను గుర్తించి ఆ నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. సర్వేలో తేలిన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి ప్రతి ఒక కుటుంబానికి తాగు నీరందేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

వాస్తవ సమాచారం అందించాలి

మిషన్ భగీరథ సర్వే కోసం ఇంటికి వచ్చే పంచాయతీ కార్యదర్శులు సిబ్బందికి ప్రజలు వాస్తవ సమాచారం అందించాలని డిచ్‌పల్లి ఎంపీడీవో రవీందర్, మోర్తాడ్ ఎంపీవో శ్రీధర్ కోరారు. నీరు సరఫరా అవుతుందా? లేదా? సరఫరా అవుతున్న నీరు ఇంట్లోని వారందరికీ సరిపోతున్నాయా? తదితర వాస్తవ వివరాలను అందించాలి.

21న జెడ్పీ సర్వసభ్య సమావేశం

నిజామాబాద్ రూరల్: జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 21న నిర్వహించనున్నట్లు సీఈవో ఉష గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సంబంధిత అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు సకాలంలో హాజరు కావాలని కోరారు. గత నెల నిర్వహించాల్సిన సమావేశం కోరం లేకపోవడంతో వాయిదాపడిన విషయం తెలిసిందే.

విద్యుత్‌శాఖలో 'ప్రజావాణి'

- ప్రతి బుధవారం నిర్వహించాలని సీఎండీ ఆదేశాలు
- వినియోగదారులు, రైతులకు చక్కని అవకాశం

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా 'ప్రజావాణి' నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతి బుధవారం ప్రజావాణి నిర్వహించాలని వరంగల్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి గురువారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రంలోని వర్ని చౌరస్తాలో ఉన్న పవర్‌హౌస్ కంపౌండ్‌లోని విద్యుత్ ప్రగతిభవన్‌లో ప్రతి బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు ప్రజావాణిని నిర్వహించనున్నారు. విద్యుత్‌శాఖ ప్రత్యేకంగా ప్రజావాణి నిర్వహించడం వినియోగదారులతో పాటు రైతులకు చక్కని అవకాశమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్యుత్ సరఫరాకు సంబంధించి తాము ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను నేరుగా జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కలగనుంది. కిందిస్థాయిలో సిబ్బంది, ఉద్యోగులు సమస్యలపై స్పందించనిపక్షంలో రాతపూర్వకంగా ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేయవచ్చు.

మెరుగైన సేవలందించడానికే..

విద్యుత్‌కు సంబంధించి వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు మెరుగైన సేవలు అందించేందుకు ప్రజావాణి ఉపయోగపడుతుంది. సీఎండీ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం కొనసాగనున్న ప్రజావాణిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. – రవీందర్, ఎస్ఈ, విద్యుత్‌శాఖ



వరల్డ్ రికార్డ్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చిన్నారికి స్థానం


అవార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు

సుభాష్‌నగర్: నగరానికి చెందిన కళ్యాణం అన్వేష్, డాక్టర్ ఎంఎస్ అనూష కుమార్తె కళ్యాణం ఆద్య 52 రోజుల్లోనే (అతి చిన్న వయస్సులో) ఆధార్‌కార్డు పొంది ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రికార్డ్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో స్థానం సంపాదించింది. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అవార్డును అందజేశారు. ఆద్య 2024 ఫిబ్రవరి 2న జన్మించగా, ఆమెకు 2004 0157 5222 నంబర్‌తో ఆధార్‌కార్డు జారీ అయ్యింది.







పీహెచ్‌సీలో కాలం చెల్లిన మందుల పంపిణీ



పొతంగల్(రుద్రూర్): పొతంగల్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో హెగ్డోలి గ్రామానికి చెందిన మహిళకు కాలం చెల్లిన మందులు ఇచ్చిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హెగ్డోలికి చెందిన శోభ నాలుగు రోజుల క్రితం పొతంగల్ పీహెచ్‌సీకి వచ్చింది. ఓపీ పరీక్షలు చేయించుకుని వెళ్లే సమయంలో తన కుమార్తె కోసం షుగర్ టాబ్లెట్లు తీసుకెళ్లింది. అవి కాలం చెల్లిన మందులుగా గుర్తించి గురువారం ఆస్పత్రికి వచ్చి సిబ్బందిని నిలదీశారు. ఫార్మసిస్ట్ లేనందున హెల్త్ సూపర్‌వైజర్ పొరపాటున మందులు ఇచ్చినట్లు ఒప్పుకున్నారు. అవసరమగు చికిత్స అందిస్తామని అంగీకరించడంతో బాధితులు శాంతించారు.

చిన్నారి అపహరణ కేసులో..

- మహిళకు ఏడాది జైలు శిక్ష

బోధన్: పది నెలల పాపను అపహరించిన కేసులో మహిళకు ఏడాది జైలు శిక్ష, రూ. వంద జరిమాన విధిస్తూ బోధన్ కోర్టులో అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి దేవన్ అజయ్ కుమార్ తీర్పును గురువారం వెలువరించారు. జరిమాన కట్టకుంటే మరో 15 రోజులు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ తెలిపిన ప్రకారం.. నిజామాబాద్ మండలంలోని కొత్తపేటకు చెందిన మేకల లక్ష్మి సాయిలు దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో తన పది నెలల పాపతో బోధన్ మండలంలోని చిన్నమావందికి వెళ్లి పుట్టింట్లో జీవిస్తోంది. పాపకు ఆరోగ్యం బాగలేనందున చికిత్స కోసం 2022 నవంబర్ 7న బోధన్ ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ చేసింది. చికిత్స అ నంతరం 9న రాత్రి ఆస్పత్రి సమీపంలోని మజీ ద్ దగ్గర పాపతో కలిసి నిద్రపోయింది. మరుస టి రోజు ఉదయం నిద్ర లేచి చూడగా కనిపించక పోయే సరికి పోలీసులకు ఫిర్యాదు చేసింది. టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్ కేసు నమోదు చేయ గా, ఎస్సై నవీన్ విచారణ చేపట్టారు. కేసులో చిన్నకుట్ల గంగామణి, అంజలి, షామీంబేగం, షహనాజ్‌ఫర్వీన్‌లను నిందితులుగా గుర్తించి చార్జీ షీట్ దాఖలు చేశారు. పోలీసుల తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమ్మయ్య వాదించారు. నిందితురాలు గంగామణికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

డిగ్రీ ఫలితాలు విడుదల చేయాలి

- తెయూ రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షా ఫలితాలను సకాలంలో విడుదల చేయాలని తెయూ రిజిస్ట్రార్ యాదగిరి సూచించారు. గురువారం వర్సిటీ పరీక్షల విభాగంలో కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు ఈనెల 15న ముగుస్తాయన్నారు. వీలైనంత త్వరగా మూల్యాంకనం పూర్తి చేసి సకాలంలో పరీక్షా ఫలితాలను విడుదల చేయాలన్నారు. ఈ ఫలితాలు విద్యార్థులు ఉన్నత విద్యలో ప్రవేశం కోసం నిర్వహించే వివిధ సెట్లకు అనుబంధంగా ఉంటాయని పేర్కొన్నారు. అడిషనల్ కంట్రోలర్లు వివిధ కళాశాలల అధ్యాపకులతో అనుసంధానమై ఫలితాలను అనుకున్న సమయానికి విడుదల చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, అడిషనల్ కంట్రోలర్స్ డాక్టర్ నందిని, డాక్టర్ శాంతాబాయి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయలక్ష్మి, పరీక్షల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో పరిశుభ్రత పాటించాలి

తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ హాస్టల్స్‌తో పాటు హాస్టల్స్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని రిజిస్ట్రార్ యాదగిరి ఆదేశించారు. రిజిస్ట్రార్ తన చాంబర్‌లో ఛీఫ్ వార్డెన్ మహేందర్, బాయ్స్, గరల్స్ హాస్టల్ వార్డెన్లు, కేర్ టేకర్స్‌తో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు యూనివర్సిటీకి హాజరవుతున్నారని హాస్టల్స్‌తో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనంతో పాటు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని ఆదేశించారు. వార్డెన్లు కిరణ్ రాథోడ్, గంగా కిషన్, కిరణ్మయి, కేర్‌టేకర్లు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 384 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు 384 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం నిర్వహించి డిగ్రీ ఆరో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షకు 4544 మంది విద్యార్థులకు 3972 మంది హాజరు కాగా 372 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షకు 162 మందికి 150 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరైనట్లు ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

- మల్టీపుల్ ఆర్గాన్ ఇన్ఫెక్షన్ బారినపడిన తల్లి
- అమ్మను కాపాడుకునేందుకు తల్లడిల్లుతున్న కొడుకు

నందిపేట్(ఆర్మూర్): పని చేస్తేనే పూట గడవని స్థితిలో ఉన్న కుటుంబానికి పెద్ద ఆపదొచ్చింది. మల్టీపుల్ ఆర్గాన్స్ ఇన్ఫెక్షన్ బారినపడి చావుబతుకుల మధ్య ఉన్న తల్లిని కాపాడుకునేందుకు కొడుకు తల్లడిల్లుతున్నాడు. చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకున్న ఆయన తల్లిని కాపాడుకునేందుకు తాహతుకు మించి అప్పులు చేశాడు. నందిపేట మండల కేంద్రానికి చెందిన మాడబోయి భోజమ్మ కొన్ని రోజులక్రితం ఉన్నట్టుండి పడిపోగా కుమారుడు గణేశ్ స్థానిక వైద్యుల వద్దకు తీసుకెళ్లాడు. వారి సూచన మేరకు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. భోజమ్మ మల్టీపుల్ ఆర్గాన్ ఇన్ఫెక్షన్ బారినపడిందని అక్కడి వైద్యులు నిర్ధారించారు. రెండేళ్ల వయస్సులోనే తండ్రిని కోల్పోయిన గణేశ్.. తల్లిని ఎలాగైనా కాపాడుకోవాలని ఇప్పటి వర కు సుమారు రూ.3.50లక్షలు అప్పు చేసి ఆస్పత్రి బిల్లులు చెల్లించాడు. ప్రస్తుతం చేతిలో డబ్బులు లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని నిర్ణయించగా, సదరు ప్రైవేట్ ఆస్పత్రి వారు మరో రూ.లక్ష చెల్లిస్తే డిశ్చార్జి చేస్తామని చెప్పారు. దీంతో గణేశ్ (96768 22808) తన తల్లిని కాపాడే ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని వేడుకుంటున్నాడు.


ఆస్పత్రిలో మాడబోయి భోజమ్మ

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. కామారెడ్డి, భిక్కనూరు, నిజామాబాద్ మండల కేంద్రాల్లో ఒక్కొక్కరు మృతి చెందడంతో వారి కుటుంబాల్లో విషాదచాయలు అలుముకున్నాయి.

పిడుగుపాటుకు మహిళా కూలీ..

కామారెడ్డి క్రైం: కూలీ పనులు చేస్తుండగా ఓ మహిళ పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ శివారులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎనుగుర్తి పుష్పవ్వ (45) తోటి కూలీలతో కలిసి అదే గ్రామానికి చెందిన మరో రైతు పొలానికి కూలీ పనికి వెళ్లింది. పనులు చేస్తుండగానే ఆమెపై నేరుగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని పట్టుబట్టారు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని సముదాయించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..

భిక్కనూరు: చెరువులో చేపల వేటకు వెళ్లిన వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆకుల నర్సింలు(56) బుధవారం సాయంత్రం చేపలు పట్టేందుకు స్థానిక బొబ్బిలి చెరువుకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఉదయం పలు చోట్ల గాలించారు. చెరువు వద్ద చెప్పులు కనిపించడంతో ఈతగాళ్ల సాయంతో చెరువులో వెతుకగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి



నిజామాబాద్ రూరల్: మండలంలోని ఆకుల కొండూర్ శివారులో గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఆకుల కొండూర్ శివారులో బుధవారం రాత్రి టీవీఎల్ ఎక్సెల్‌పై జన్నెపల్లి వైపు వెళ్తుండగా రైస్‌మిల్ ఎదురుగా అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్నట్లు తెలిపారు. మృతుడి, వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 59849 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ ఇద్దరు..

డిచ్‌పల్లి: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొత్తబాది తండాకు చెందిన పవార్ లలిత (30) జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇందల్వాయి మండలం గండితండాకు చెందిన పవార్ లలితకు కొత్తబాది తండాకు చెందిన వ్యక్తితో 2010లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత ఏడాది కాలంగా భర్తతో గొడవలు జరుగుతున్నాయి. దీంతో లలిత తల్లిగారింటికి వచ్చింది. ప్రస్తుతం డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ వద్ద అద్దె ఇంట్లో నివసిస్తోంది. బుధవారం మధ్యాహ్నం నడిపల్లి చెరువులో పడి తీవ్రగాయాల పాలైంది. ఆమె వెంట ఉన్న వ్యక్తి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో లలిత హత్యకు గురైనట్లు తేలడంతో హత్య కేసుగా నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామని పోలీసులు పేర్కొన్నారు.

తిప్పాపూర్‌లో..

భిక్కనూరు: పురుగుల మందు సేవించి ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని తిప్పాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగర్తి ప్రవీణ్(17) అనే విద్యార్థి ఇంటర్ వరకు చదివాడు. కాగా ఈ నెల 4న పురుగుల మందు తాగి కుటుంబీకులకు చెప్పలేదు. అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు మొదటగా స్థానిక ఆస్పత్రులు, రామాయం, హైద్రాబాద్ ఆస్పత్రుల్లో చూయించినా నయం కాలేదు. దీంతో కుటుంబీకులు గాంధీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. గురువారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయమై ఎస్సైను వివరణ కోరగా ఇప్పటి వరకు కుటుంబీకులు ఫిర్యాదు చేయలేదని అన్నారు.





